

ఎస్వీ జూపార్క్‌లో వన్యప్రాణి వారోత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అలిపిరి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల జూ పార్క్ లో వన్యప్రాణి వారోత్సవాలను జూ పార్క్ క్యూరేటర్ సెల్వం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జూ పార్కు క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ ఈ వన్యప్రాణి వారోత్సవాలు ఈనెల 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. చిన్నారులలో అడవుల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మొదటిరోజు 200 మంది విద్యార్థులకు చిత్ర లేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు పాల్గొన్నారు.

మా మొర ఆలకించు..!

తిరుపతిని మద్యరహితంగా ప్రకటించాలి

గాంధీ విగ్రహం ముందు ఐద్వా నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నూతన మద్యం పాలసీని నిరసిస్తూ గాంధీ జయంతి పురస్కరించుకుని తిరుపతిలో ఐద్వా ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తిరుపతిని మద్యరహిత ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. అనంతరం కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జయంతి, డాక్టర్ పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ అక్టోబర్ నుంచి అమల్లోకి రానున్న నూతన మద్యం పాలసీలో భాగంగా తిరుపతి జిల్లాకు అధికంగా షాపులు కేటాయించి ప్రజలను మత్తులో ముంచడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం అమ్మిన బ్రాండ్ల కంటే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని చెబుతున్నారని, నాణ్యమైన మద్యం అంటే మహిళలపై హింస జరగకుండా, అత్యాచారాలు జరగకుండా, ప్రమాదాలను నివారించేలా ఉంటుందా? అని ప్రశ్నించారు. తిరుపతిని మద్యరహిత ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డు పవిత్రత గురించి మాట్లాడుతున్న నాయకులు తిరుపతిలో ఏరులై పారిస్తున్న మద్యం గురించి మాట్లాడరా? అని ప్రశ్నించారు. పుట్టపర్తి షిరిడిలాంటి ప్రాంతాల్లో మద్యాన్ని నియంత్రించారని, తిరుపతిలో ఎందుకు నియంత్రించరన్నారు. తిరుపతి పవిత్రత గురించి మాట్లాడే బిజెపి, టిడిపి, జనసేన నాయకులు సమాధానం చెప్పాలన్నారు. గుడి, బడి అనే తేడా లేకుండా ఎక్కడబడితే అక్కడ మద్యం ఏరులై పారుతోందని, మహిళలపై హింస రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, ఐద్వా నాయకులు కోమలమ్మ, సాయిదీప్తి, లత, బుజ్జమ్మ రాజు, జెవివి నాయకులు ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట సిఐటియు కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఎంపిటిసి ఎన్.రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ మద్యం ఉన్న ప్రతి ఇంట్లో హింస పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఒ.వెంకటరమణ, కె.హరినాథ్, తులసిరాజన్, లక్ష్మి, గిరిజ, రెడ్డెమ్మ, దిల్షాద్, మాధవి పాల్గొన్నారు.


వెంగమాంబ నిత్యాన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న పవన్‌కల్యాణ్

నేడు తిరుపతిలో 'వారాహి' సభ

ప్రజాశక్తి - తిరుమల

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11 రోజుల దీక్షను బుధవారం విరమించారు. కూతుర్లతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుమలకు వెళ్లిన ఆయన శ్రీవారి సమక్షంలో తాను చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'ఇది కేవలం లడ్డూ కల్తీ గురించి కాదని, ప్రాయశ్చిత్త దీక్ష అనేది సనాతన ధర్మ రక్షణను ముందుకు తీసుకువెళ్లడానికి చాలా అవసరం' అన్నారు. ఇదిలా ఉండగా తిరుపతిలో తలెత్తిన సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాన్ని కోరుతూ, దానికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను బుధవారం ఆవిష్కరించబోతున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు. గురువారం జరిగే వారాహి సభలో పవన్ వారాహి డిక్లరేషన్ పుస్తకంలోని అంశాలను ప్రజలకు తెలియజేయనున్నట్లు

శ్రీవారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

సమాచారం. పవన్ చేతిలో ఉన్న రెడ్ కలర్‌లో ఉన్న ఆ బుక్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆ బుక్ కవర్ పేజీపైన ధర్మో రక్షతి రక్షిత్ణ అని రాసి ఉంది. దాని కింద వారాహి అమ్మవారి చిత్రం కూడా ఉంది. అయితే ఆ బుక్ లో ఏముందని చర్చించుకుంటున్నారు. నేడు తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో వారాహి బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఇక్కడే పుస్తకంలోని అంశాలను పవన్ స్వయంగా వెల్లడిస్తారని సమాచారం. ఎంఎల్‌సి పిడుగు హరిప్రసాద్, తిరుపతి రైల్వేకోడూరు శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, అరవా శ్రీధర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై

పవన్, చంద్రబాబు స్పందించాలి

కార్మికసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా తిరుపతి సబ్‌కలెక్టరేట్ వద్ద సిఐటియు, ఎఐటియుసి, భవన నిర్మాణ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.సుబ్రమణ్యం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, రాధాక్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పండుగలు జరుపుకున్నారని, ప్రధాన సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, సిఎం చంద్రబాబు స్పందించాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 4,200 మంది కాంట్రాక్టు కార్మికుల గేట్ పాసులను తిరిగి తీసుకున్నారని, రెగ్యులర్ ఉద్యోగులు 2,500 మందికి విఆర్ఎస్ వచ్చి బలవంతంగా ఇళ్లకు పంపించారన్నారు. 500 మంది రెగ్యులర్ ఉద్యోగులను డిప్యుటేషన్‌పై ఇతర సంస్థలకు బదిలీ చేయాలని చూస్తున్నా, భూములను కారుచౌకగా అమ్మేస్తున్నా,

కార్మిక సంఘాల నాయకులు

ఉక్కు సామర్థ్యం 75 లక్షల టన్నుల నుంచి 40 టక్షల టన్నులకు తగ్గించినా పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీకి భయపడి ప్రశ్నించే ధైర్యం లేక చేతులు ముడుచుకుని కూర్చున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. తిరుపతిని మద్యరహితంగా ప్రకటించాల్సింది పోయి, అదనంగా షాపులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డి రవి, వేణుగోపాల్, విశ్వనాథం, శ్రీరాములు, కెవై రాజా, బుజ్జి, ఎన్‌డి శ్రీను, భాస్కర్, ఉమాపతి పాల్గొన్నారు.

వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, జాన్, బాలకృష్ణయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించకుండా నష్టాల్లో ఉందని కుంటిసాకులు చూపుతూ ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. నాయకులు మంజుల, శివకుమార్, ప్రసాద్, సుబ్రమణ్యం, శేఖర్, బాలాజీ, నరేష్ పాల్గొన్నారు.

గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన జరిగింది. సిపిఎం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి బంగారు గుడ్డు పెట్టే బాతులాంటి గని విశాఖ ఉక్కును పోస్కో కంపెనీకి కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందన్నారు. బివి రమణయ్య, పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి రెండు రోజుల పర్యటనకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతి రేణిగుంట విమానాశ్రయంలో ఇంటలిజెన్స్ అధికారులు ,తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్, డి ఆర్వో , విమానాశ్రయ అధికారులు, ఇతర శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తిరుపతి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమల వరకు ముఖ్యమంత్రి పర్యటించు ప్రాంతాలను పరిశీలించారు తిరుమల టి.టి.డి ఉన్నతాధికారులతో కలసి తిరుమలలో పర్యటించు ప్రదేశాలలో క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి తిరుమల రాక సందర్భంగా తిరుపతి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమల వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, అలాగే అప్ ఘాట్, డౌన్ ఘాట్ లోనూ స్పెషల్ పోలీస్ టీం లచే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామన్నారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్‌ను నిర్వహించారు.

26న లైవ్ మ్యూజిక్ ప్రోగ్రామ్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రముఖ నగరాలైన గోవా, బెంగళూరు, చెన్నై, హైదరాబాదుకు ధీటుగా ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో ఈ నెల 26న సాయంత్రం ఎస్వీ యూనివర్సిటీ వద్దనున్న తారకరామా స్టేడియంలో కార్తిక్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాణ ఎంటర్టైన్మెంట్స్ అసోసియేషన్ ఫోర్త్ గ్రూప్ ఈవెంట్స్ ప్రతినిధులదో కలిసి ఆయన లైవ్ మ్యూజిక్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ యువతలో నూతన ఉత్సాహన్ని కల్పిస్తూ వారిని ఉత్సాహంగా ఆనంద భరితులను చేయాలనే సంకల్పంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు మధ్య ఈ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 10 నుండి 15 వేల మంది హాజరుకానున్నారన్నారు. టికెట్లను నాలుగు కేటగిరీలుగా రూ.600 నుంచి రూ.3500 వరకు ధరలు నిర్ణయించామన్నారు.ఈ సమావేశంలో ప్రవీణ్‌కుమార్, జయప్రకాష్, సజిత్ పాల్గొన్నారు.

నేటి నుండి మెడికల్ పీజీ విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మొట్టమొదటి సారి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో పీజి విద్యార్థులకు మానసికోల్లాసాన్ని కల్పించడానికి క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నట్లు క్రీడల నిర్వాహకులు డాక్టర్ తులసీ రాం తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన టోర్నమెంట్ వివరాలను తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 16 క్రీడా .జట్లు వస్తున్నాయన్నారు. వీరందరికి మెడికల్ కళాశాల పీజి హాస్టల్ లో వసతి బస ఏర్పాట్లు చేసామన్నారు. డెంటల్ కళాశాల వారు ఈ టోర్నమెంట్లో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంబించడానికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరౌతారన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారం అందిస్తున్నారన్నారు.క్రికెట్ జట్టు కెప్టెన్ వినీత్, మెడికల్ కళాశాల పిఆర్వో వీర కిరణ్ పాల్గొన్నారు.

'మా అమ్మజాడను తెలపండి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బతుకు దెరువు నిమిత్తం మస్కట్ దేశానికి వెళ్ళిన తన తల్లి ఇంద్రాణి ఏజెంట్ ద్వారా మోసపోయి ఆ దేశంలోనే ఇబ్బందులు పడుతూ తిరుగుతోందని రేణిగుంట మండలం తారకరామా నగర్ కు చెందిన జాన్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఇంద్రాణి చెల్లెలు సుధారాణితో కలసి జాన్సన్ మాట్లాడారు. ఏడు నెలలకు మునుపు తమిళనాడుకు చెందిన ఓ ఏజెంట్ను నమ్మి రెండవ సారి మస్కట్ కు వెళ్ళిందన్నారు. అక్కడ ఏమి జరిగిందో తెలియదని, ప్రమాదంలో ఉన్నానని వీడియో పంపి, ఇప్పటికి రెండు వారాలు అవుతున్నా ఫోన్ పనిచేయ్యడం లేదని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, నియోజికవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించి తన తల్లి ఇంద్రాణి జాడను గుర్తించి స్వదేశానికి తీసుకరావాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశామన్నారు.

ప్రసంగిస్తున్న విటపు బాలసుబ్రమణ్యం

ప్రపంచస్థాయి మేధావి ఏచూరి

సంస్మరణ సభలో విటపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

ప్రపంచస్థాయి మేధావి సీతారాం ఏచూరి అని మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షకుడుగా, బహుజనుల బాంధువుడుగా, సామ్యవాద స్వాప్నికుడుగా, ప్రజా సైనికుడుగా పనిచేసిన సీతారాం ఏచూరి మరణం తీరని లోటన్నారు. సూళ్లూరుపేట శేషసాయి కల్యాణ మండపంలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ సభకు సిపిఎం నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఔనత్యాన్ని వివరించారు. సిద్ధాంతకర్తగా ఆయన ఆలోచనలు అన్ని పార్టీలకు ఆమోదయోగ్యమే కాకుండా

ఏచూరికి నివాళి అర్పిస్తూ...

ఆచరణీయమన్నారు. ఈ సభలో తిరుపతి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, శ్రామిక మహిళా సంఘం అధ్యక్షులు లక్ష్మి, నాయకులు మోహన్‌రావు, పద్మనాభయ్య పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమంతరెడ్డి, టిడిపి టౌన్ అధ్యక్షులు ఆకుతోట రమేష్, సిపిఐ కార్యదర్శి సుధాకర్ కాళింగ్, ప్రభాకర్ రాజకీయాలకు అతీతంగా ఏచూరి సాధారణ జీవితాన్ని, సిద్ధాంతానికి కట్టుబడి ఉండటాన్ని ప్రశంసించారు.

కళ్లెదుటే కబ్జాకు యత్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి–పిచ్చాటూరు ప్రధాన రహదారి, రామచంద్రాపురం సమీపంలోని సర్వే నంబర్ 360/2 లో ఉన్న సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిని కొందరు మంగళవారం కబ్జాకు చేసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి తహశీల్దార్ రెవెన్యూ సిబ్బందిని పంపి కబ్జాను అడ్డుకున్నారు. ఈ భూమిలో 2004 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు, అప్పటి ఎంపీ డాక్టర్ చింతామోహన్ దళితులకు ఇంటి నివాస పట్టాలను ఇచ్చారు. సంవత్సరాల తరబడి ఇళ్లు నిర్మించలేదని తహల్దాశీల్దార్ దేవేందర్ రెడ్డి 2008, 2009 సంవత్సరంలో ఇచ్చిన పట్టాలను రద్దుచేసి ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. 2023లో సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఈదులగుంట ఎస్సీ



ఎస్టీలకు ఒకటిన్నర సెంటు లెక్కన ఇంటి పట్టాలు ఇవ్వాలని లేఅవుట్ వేసి కరెంటు, తాగునీటి బోర్లు వేయడం జరిగింది. గతంలో మాజీ మంత్రి బొజ్జల గోపాల కష్ణారెడ్డి కూడా ఆ భూమిని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించాలని తలచారు. అయితే కొందరు వ్యక్తులు ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఈ భూమిని కొట్టేసేందుకు దండయాత్ర చేస్తూ వస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కంటికి రెప్పలా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాండూరులో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

పాండూరులో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది. 'ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు చేపడతాం' అని రెవెన్యూ అధికారుల హెచ్చరిక నోటీసులను సైతం కబ్జాదారులు లెక్క చేయడం లేదు. రెవెన్యూ అధికారులు సైతం కబ్జాదారుల కొమ్ముగాస్తూ ప్రభుత్వ భూములను కాపాడటం లేదన్న విమర్శలూ లేకపోలేదు.

వరదయ్యపాలెం మండలం పాండూరు రెవెన్యూలోని సర్వే నంబర్ 915లో 4.26 ఎకరాలకు హద్దులు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో ఈ భూముల్లో 1.70 ఎకరాలకు సంబంధించి నకలీ పట్టాలను అధికారులు రద్దు చేశారు. ప్రస్తుతం ఈ భూముల్లో అక్రమంగా ప్రవేశిస్తున్న కబ్జాదారులు రెవిన్యూ అధికారులకు తాయితాలు సమర్పించుకుని నకిలీ పట్టాలను పొందాలని ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. హెచ్చరిక బోర్డులను సైతం లెక్క చేయడం లేదు. మండల రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

రేపే శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భ చాప, తాడును టిటిడి అటవీ విభాగం కార్యాలయం నుండి బుధవారం డిఎఫ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయం రంగనాయకుల మండపంలోని శేషవాహనంపై దర్భతో తయారుచేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 4వ తేదీ జరిగే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు.

ధ్వజారోహణానికి దర్భ చాప, తాడు కీలకం

బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభంపైకి గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. రుత్వికులు వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టిటిడి అటవీ శాఖ 10 రోజుల ముందునుంచే కసరత్తు చేస్తోంది. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భను ఉపయోగిస్తారు. ఇందుకోసం ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో విష్ణుదర్భను టిటిడి అటవీ సిబ్బంది సేకరించారు. దీన్ని తిరుమలకు తెచ్చి

ధ్వజారోహణ దర్భచాప, తాడు ఊరేగింపు

తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెట్టి బాగా శుభ్రపరచి, చాప, తాడు తయారు చేశారు. అటవీశాఖ సిబ్బంది 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో దర్భ చాప, 225 మీటర్ల పొడవు తాడు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి రమణారెడ్డి, శ్రీనివాసులు, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'లో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రతి ఒక్కరూ 'స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత' పై అవగాహనతో పాటు భాగస్వామ్యం ఉండాలని కలెక్టర్ ఎస్.వేంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కచ్చపి ఆడిటోరియం నందు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా –2024 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఎస్.వేంకటేశ్వర్, ఎంఎల్‌సి సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎం.ఎల్.ఏ సుగుణమ్మ, మున్సిపల్ కమిషనర్ ఎన్‌మౌర్య సంబందిత అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి కార్పొరేషన్ పరిధిలో చాలాకాలంగా పేరుకుపోయిన చెత్తను లక్ష్యంగా పెట్టుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ ప్రణాళాకాబద్ధంగా కమిషనర్ చొరవతో శుభ్రంగా ఉంచామన్నారు. స్పెషల్‌డ్రైవ్ కింద దాదాపు 2015 టన్నుల చెత్తను తొలగించామన్నారు. జిల్లాలోని సుమారు 700 ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వాడకంలో తీసుకొచ్చి చెత్త నుండి సంపద సృష్టించాలన్నారు. తిరుపతి మున్సిపాలిటీ నందు మురుగునీటిని శ్రీకాళహస్తి ఎలెక్ట్రో క్యాస్టింగ్ వారికి విక్రయించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేరుకుతుందని తెలిపారు. మున్సిపల్ కమీషనర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ గాంధీకి నివాళిగా స్వచ్ఛతాహిసేవా కార్యక్రమం ద్వారా గత రెండు వారాలుగా తిరుపతి పట్టణం నందు స్వచ్ఛత పై ప్రతి రోజు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పారిశుద్య కార్మికుల చేత పరిశుభ్రత చేయడం జరుగుతుందన్నారు. శానిటరీ వర్కర్స్ అందరు అంకిత భావంతో వారి యొక్క విధులను నిర్వహించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మాజీ తుడ చైర్మన్ నరసింహ యాదవ్, డి.ఎం.అండ్ హెచ్ ఓ శ్రీహరి, మున్సిపల్ అధికారులు, ఇంజనీర్లు, సంబందిత అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం : మేయర్

అహింసే ఆయుధంగా మన దేశానికి స్వాతంత్రం సాధించిన జాతిపిత గాంధీజీ అడుగుజాడల్లో అందరూ నడవాలని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాంధీ జయంతి కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్. మౌర్య, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అధికారులు గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా స్వరాజ్య స్థాపనకు అందరూ కషి చేయాలని అన్నారు.

కార్యక్రమంలో తుడా సెక్రటరి వెంకట నారాయణ, ఎస్.ఈ. కష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్రయ్య, పి.ఓ.దేవి కుమారి, ఏఏఓ సుగుణ, తదితరులు పాల్గొన్నారు. గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం విద్యతోనే సాధ్యమని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్‌రాజు అన్నారు. రేణిగుంట బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వినియోగదారులకు అత్యుత్తమ సేవలే లక్ష్యం : సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా వినియోగదారుల సేవే పరమావధిగా భావించి, విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం(విద్యుత్ నిలయం)లో బుధవారం ఉదయం మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి కె. సంతోష రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సముపార్జనకు మహాత్మా గాంధీ అహింసా మార్గంలోనే అనేక ఉద్యమాలను చేపట్టి, వాటిని విజయవంతం చేశారని తెలిపారు. ఉద్యమాల్లో గాంధీజీ అవలంభించిన మానవతావాదం, అహింస, శాంతి సిద్ధాంతాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం వుందన్నారు. భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలు కూడా గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించడం గొప్ప విషయమని వివరించారు. నేటి సమాజంలో యువత గాంధేయ మార్గాన్ని అనుసరిస్తూ సమాజాభివద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు (ఎఫ్‌ఎసి) పి. అయుబ్ ఖాన్, వై. లక్ష్మీనరసయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, డి.ఎస్. వరకుమార్, కె. ఆర్. ఎస్. ధర్మజ్ఞాని, కె. ఆదిశేషయ్య, పి. హెచ్. జానకిరామ్ పాల్గొన్నారు

టెట్ సెంటర్ పరిశీలన

టెట్ సెంటరును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలోని టెట్ (టీఈటీ) పరీక్ష సెంటరును బుధవారం టెట్ పరీక్షల తిరుపతి జిల్లా పరిశీలకులు ప్రసన్న కుమార్ బుధవారం పరిశీలించారు. గురువారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచనలు అందించామని ఆయన తెలిపారు. ఆయన వెంట మల్లికార్జున్ రావు, సనత్ కుమార్ ఉన్నారు.

ఆర్‌వో మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం

వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం ఎస్‌బి ఆర్ పురం పంచాయతీ లోని ఎపిఎస్‌డబ్ల్యూ అంబేద్కర్ కాలనీలో సర్పంచి మణిరాజు కుటుంబ సభ్యులు (ఆర్ సుబ్బయ్య, ఆర్ చంద్రశేఖర్ రాజు)ల జ్ఞాపకార్థం ఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు ఆర్‌వో మినరల్ వాటర్ ప్లాంట్లను నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మణిరాజు కుటుంబ సభ్యులు జ్ఞాపకార్థం ఇలాంటి సేవలు చేయడం ఎంతో శుభ పరిణామం అని ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటివి ఏర్పాటు చేయడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో వడమాలపేట టిడిపి మండల కార్యదర్శి జానా వెంకటయ్య, నాయకులు ధనుంజయులు నాయుడు, హేమలత, ఎస్‌బిఆర్‌పురం గ్రామ ప్రజలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుడికి సన్మానం

వెంకట నారాయణను సన్మానిస్తున్న జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి -నాయుడుపేట: గాంధీ జయంతిని పురస్కరించుకుని నాయుడు పేటలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పలువురు రాజకీయ నాయకులు వారివారి కార్యాలయాల్లోనూ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడుపేటకు చెందిన అలనాటి స్వాతంత్ర యోధుడు మిరియాల వెంకటనారాయణను నాయుడు పేటకు మాజీ ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి సన్మానించారు. 1940వ సంవత్సరంలో మహాత్మా గాంధీ నాయుడుపేట పట్టణానికి విచ్చేసిన సందర్భంగా ఆయనతో కలిసి స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్న నాయుడుపేట పట్టణానికి చెందిన మిరియాల వెంకటనారాయణను తంబిరెడ్డి శాలువా కప్పి, పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. వెంకట నారాయణ తండ్రి గోవిందయ్య అప్పట్లో మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారితో పోరాడుతున్న సమయంలో సంగ్రామంలో పాల్గొని సేవలందించారు. వెంకటనారాయణను సన్మానించడం సంతోషంగా ఉందని తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గోవా మాధవయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోడీ ఎత్తుగడలను ప్రజలు తిప్పి కొడతారు

గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను విభజించు పాలించు అనే విధంగా పరిపాలన కొనసాగిస్తోందని, ప్రధాని మోడీ ఎత్తుగడలను ప్రజలు తిప్పి కొడతారని తిరుపతి జిల్లా కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. గాంధీ జయంతి సందర్భంగా తిరుపతి నగర పరిధిలోని బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహం వద్ద వారు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని బిజెపి పాలన తీరుపై నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, తిరుపతి పట్టణ అధ్యక్షులు చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికార దాహంతో మతోన్మాద దుశ్చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేవలం అధికారం కోసం దారుణాలకు పాల్పడటాన్ని ఎప్పుడూ చూడ లేదన్నారు. దేశ ప్రజల సమస్యల పరిష్కా రం కన్నా తాము అధికారంలో ఉండ టమే లక్ష్యంగా ఆ పార్టీ ముందుకు సాగుతోం దన్నారు. నేడు దేశంలో ఆ మహాత్మా గాంధీ కలలు కన్న పాలన కనుమరుగైం దన్నారు. కుల, ప్రాంతీయ తత్వాలు, మతోన్మాదం చర్యలతో దేశం అతలాకుతలం అవుతోంద న్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి బీసీ సెల్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సుప్రజా, నరేంద్ర బాబు, లోకేశ్వర్ రెడ్డి, నాని, పార్థసారధి రెడ్డి, గోపిగౌడ్, చిరంజీవి, నన్నే ఖాన్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి గ్రామ సభలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని పలు పంచాయతీలలో ప్రతి ఏటా అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి జరిగే గ్రామసభలు ఈసారి కూడా యథావిధిగా నిర్వహించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ ద్వారా గ్రామ పంచాయతీలలో ఏ ఏ పనులు చేపట్టాలో చర్చించి సమర్థవంతంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి అధికారులు, మండల పరిషత్ అధికారులు, సెక్రటరీలు, గ్రామ సర్పంచులు, నాయకులు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసి వేత

- గేటు తీసివేయాలని రైల్వే జిఎంకు వినతి
- స్పందించని అధికారులు
- పలు గ్రామాల రాకపోకలకు ఇబ్బంది

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఎన్నో సంవత్సరాలుగా రాకపోకలు సాగిస్తున్న రైల్వే గేటును రైల్వే అధికారులు మూసివేశారు. ఈ కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పలుసార్లు దీనిపై ఆందోళన చేపట్టి రైల్వే జిఎంకు అప్పటి ఎమ్మెల్యే ముద్దుకృష్ణమనాయుడు సైతం వినతిపత్రాలు అందించారు. అయినా రైల్వే అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదు. రైల్వే అధికారులు వెంటనే గేటును తీసివేసి పలు గ్రామాల ప్రజల రాకపోకలకు వీలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టణంలోని స్థానిక ద్రౌపదీదేవి ధర్మరాజుల ఆలయం ఎదురుగా ఉన్న గేట్ పుత్తూరుకు వెళ్లేందుకు ఈ ప్రాంతంలో వున్న రైల్వే గేటు ఎంతో ఉపయోగకరంగా వుండేది. రైల్వే అధికారులు ఇప్పుడు గేటును మూసివేయడంతో గేటు పుత్తూరు నుంచి బజువైపు వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రైల్వే గేటును మూసివేయకూడదని రైల్వే అధికారులకు మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు అప్పట్లో పలు సార్లు పోరాటాలు చేసి రైల్వే జిఎంకు వినతి పత్రాలు సైతం అందించారు. అయినా రైలె అధికారులు స్పందించలేదు. కొద్ది సంవత్సరాలుగా పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. గేటు మూసివేయకముందు గతంలో చుట్టుపక్కల ప్రాంతాలు గేటు పుత్తూరు, తొర్రూరు, చౌటూరు , పిళ్లారిపటు, గోపాల కృష్ణాపురం, నేసనూర్, గ్రామ ప్రజలు రైల్వే గేట్ దాటి తమ ప్రాంతాలకు సులభంగా వెళ్లేవారు. ప్రస్తుతం గేటు మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ ఊర్లకు వెళ్లాలంటే బ్రిడ్జి చుట్టుకుని రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సి వుంది. నడిచి వెళ్లాలంటే విద్యార్థులు, వృద్ధులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు స్పందించి గేటును తీసివేసి ప్రజలకు దారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేగేటు మూసివేతతో అవస్థలు ఎదుర్కొంటున్న స్థానికులు

సామాజిక విలువల పెంపులో పెద్దలది కీలక పాత్ర : లక్ష్మి

ప్రజాశక్తి - క్యాంపస్ : సమాజంలో చిన్నపిల్లల్లో విలువలను పెంపొందించడంలో పెద్దలు కీలక పాత్ర పోషిస్తారని డిస్టిక్ కో ఆపరేటివ్ ఆఫీసర్ లక్ష్మి పేర్కొన్నారు. ఎస్‌వియులోని గృహ విజ్ఞాన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవం వర్సిటీ నర్సరీ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో చిన్న పిల్లలలో నైతిక, మానసిక, సాంఘిక విలువలను పెంపొందించడంలో వయో వృద్ధులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తారన్నారు. ఆచార్య కె అనురాధ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్ల చిన్న పిల్లల్లో నైతిక, సామాజిక అంశాల గురించి వారికి వివరించేవారు కరువయ్యారన్నారు. కుటుంబంలో పెద్దవారు ఉండడం ద్వారా చిన్నపిల్లలలో మానసిక, నైతిక, సాంఘిక విషయాలలో మన వైఖరుల పట్ల పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించే అవకాశం వుందన్నారు. స్కూల్లోని వివిధ ప్రత్యేకతలు, ఆధునిక సౌకర్యాల గురించి వివరించారు. దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి, ఆవశ్యకత గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు చక్కగా వివరించారు. నర్సరీ పాఠశాలలో వయో వృద్ధులకు ఆటల, పోటీలు నిర్వహించి వారిలో ఆనందం కలిగించారు. ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రం విభాగాధిపతి ఆచార్య కోలా మంజుల, డాక్టర్ బి స్వరూప రాణి, ఆచార్య సుచరిత, నర్సరీ స్కూల్ టీచర్లు డాక్టర్ సుదర్శనమ్మ, రాధిక, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల దినోత్సవం కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు

పారిశుధ్య కార్మికులకు అండ: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మున్సిపాల్టీ కార్మికులకు ఏవైనా సమస్య వస్తే వారి కుటుంబ సభ్యుడిలా పరిష్కరించేందుకు పాటు పడతానని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవను నిర్వహించారని తెలిపారు. గూడూరు మున్సిపల్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల వరదలు సంభవించిన విజయవాడలో ఉత్తమ సేవలు అందించిన గూడూరు మున్సిపాల్టీ కార్మికులు 11 మందికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ పురస్కారాలు అందించి అభినందనలు తెలిపారు. గూడూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే మున్సిపల్ కార్మికులను తాను కుటుంబ సభ్యులుగా భావిస్తానని ఎల్లవేళలా వాళ్లకి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ కార్మికులు సిబ్బంది, వారి ఉత్తమ సేవలను అందిస్తూ పట్టణ అభివృద్ధికి సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ఏపీలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ :
ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల భూమి తగాదాల పరిష్కారానికి, పెండింగ్‌లో వున్న అపరిష్కృతమైన కేసుల పరిష్కారానికి సుప్రీం కోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సెనేట్ హాల్ లో ఎన్ఎస్ఎల్ఏ వ్యవస్థాపక అధ్యక్షులు సుందరరాజు, మోహన్ అధ్యక్షతన 'దక్షిణాది ప్రాంతంలో సుప్రీంకోర్టు బెంచ్ అవసరం.. దాని ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్ వినోద్ కుమార్, బిజెపి రాష్ట్ర స్పోక్ పర్సన్ జి భాను ప్రకాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ న్యాయ వ్యవస్థ మౌలిక సూత్రం, సుపరిపాలన, సామాజిక న్యాయం, సమాజ అని రంగాల్లో భారత పౌరులందరికీ జనాభా దామాషా పద్ధతిన పంపిణీ న్యాయం జరగాలన్నారు. లా కమిషన్ రిపోర్ట్ 2009 లో సుప్రీంకోర్టు బెంచీలు దక్షిణాదిలో చెన్నై, హైదరాబాద్, ఉత్తరాదిలో ఢిల్లీ, తూర్పున కలకత్తా, పశ్చిమాన ముంబైలో ఏర్పాటు చేయాలని సూచించినా పరిగణనలోకి తీసుకోలేద న్నారు. గతంలో వచ్చిన కమిషన్లను ప్రభుత్వం తక్షణమే సౌత్ ఇండియాలో సుప్రీంకోర్టు బెంచ్‌ని ఏర్పాటు చేయడం సామాన్య ప్రజలకు న్యాయం జరగడానికి సాధ్యపడుతుందని వారు పేర్కొన్నారు. జి భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణాదిలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ని స్వాగతిస్తూ తాను భవిష్యత్తులో ప్రధానమంత్రి మోడీ, అమిత్ షాలతో మాట్లాడి సుప్రీంకోర్టు బెంచ్ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుప్రీంకోర్టు బెంచ్ దక్షిణాది లో ఏర్పాటు చేసేందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డితో మాట్లాడి అసెంబ్లీ సమావేశాలలో ఈ విషయం డిమాండ్ గురించి ప్రస్తావించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరిస్తున్న అతిథులు, వక్తలు

క్రైం న్యూస్

టాస్క్‌ఫోర్సు అధికారుల అదుపులో వున్న ఎర్రచందనం దొంగలు

ఎర్రచందనం దుంగలు పట్టివేత

- నాటు తుపాకీ స్వాధీనం - ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం సమీపంలోని అడవుల్లో 63 ఎర్రచందనం దుంగలతో పాటు, ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి అడవి జంతువులు వేటాడే ఒక నాటు తుపాకీని టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ ఎం చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ ఎం మురళీధర్ రెడ్డి బృందం సోమవారం రాత్రి కెవిబిపురం మండలం పచారు మాను వద్ద కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. అప్రమత్తమైన టాస్క్ ఫోర్స్ సిబ్బంది వీరిని హెచ్చరించి చుట్టుముట్టి ఇద్దరిని పట్టుకున్నామన్నారు. వీరు కెవిబిపురం మండలానికి చెందిన వ్యక్తులుగా గుర్తించామన్నారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు. పారి పోయిన వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామన్నారు. ఈ ఆపరేషన్ లో స్థానిక అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎస్కే ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను మోటార్ బైక్ అదుపు తప్పి ఢీ కొంది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు పెను ముప్పు తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు వాహనం స్వల్పంగా తగలడంతో పెనుముప్పు తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్వల్పంగా గాయపడ్డ వారిని స్థానికుల సాయంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు ఓ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

డెంటిస్ట్ చందనా స్రవంతిని సత్కరిస్తున్న గుడ్లూరు మయూర్

చందనా స్రవంతికి సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితు లైన ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ పారి చందనా స్రవంతిని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూ రు మయూర్ బుధవారం ఘనంగా సత్కరించారు. ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మయూర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఈ నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కడం అదృష్టం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనమాల గురవయ్య, పారి మధు,(పాడేటి రవి, కలపాటి విజయ్ కుమార్, గుమ్మడి మురళి, పల్లి రాజా, సుబ్రమణ్యం, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : జవహర్ నవోదయ విద్యాలయలో 2025-2026 విద్యా సంవత్సరానికి 9 నుండి11వ తరగతి ప్రవేశాని జాతీయ స్థాయిలో 2025, ఫిబ్రవరి 8వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టరు యన్ విశ్వనాథ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 2024-2025 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినివిద్యార్థులు, 9వ తరగతిలో, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినివిద్యార్థులు 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు అని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ 30 అక్టోబర్ 2024 అని తెలిపారు. వివరాలకు 8688888802 , 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ముత్యాలమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రామచంద్రాపురం మండలంలోని రాయల చెరువు వద్ద వున్న శక్తి పీఠం ఆవరణలో నవరాత్రి ఉత్సవాలకు బుధవారం అంకురార్పణతో ప్రారంభమైంది. ముత్యాలమ్మకు రాయలచెరువు గ్రామస్తులు సారె సమర్పించారు. 108 కలశాలతో వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి విశేషంగా అభిషేకాలు నిర్వహించి, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం గ్రామస్తులు ఇంటి నుంచి పొంగళ్లను మంగళ డప్పు వాయిద్యాల నడుమ నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయ నిర్వహకులు భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాత్మ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంగణంలో లైబ్రరీ ఎదుట మహాత్మ గాంధీ విగ్రహానికి విశ్వవిద్యాలయ అధికారులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు , ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, లైబ్రేరియన్ ఆచార్య సురేంద్ర బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య తులసీరామకృష్ణారెడ్డి, పద్మనాభం, నరసయ్య, ఓవియస్ రెడ్డి, ఇంజనీర్ తాండవకృష్ణ పాల్గొన్నారు.

రామచంద్రాపురం(చంద్రగిరి): పంచాయతీ కార్యాలయంలో చంద్రగిరి సర్పంచ్ రూపవతి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ మహేశ్వరయ్య, ఆదెమ్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోట : కోట తహశీల్దారు కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా వాకాడు తహశీల్దారు కటారి జయజయరావు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీఆర్వో లు వెంకటరమణయ్య, భక్తవత్సల రెడ్డి, మోషిన్, వీఆర్ఏ వెంకయ్య, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

తిరుపతి సిటీ: గాంధీ టిటిడి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో జెఈవో వీరబ్రహ్మం గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ ఓ వరప్రసాదరావు, సిఈ సత్య నారాయణ , డిప్యూటీ ఈవోలు గుణ భూషణ్ రెడ్డి, ఆనంద రాజు, శాంతి, నాగరత్నతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: గాంధీ జయంతి సందర్భంగా కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్ర, అన్నదానం నిర్వహించారు. గాంధీ రోడ్ లోని ఆ సంస్థ కార్యాలయం వద్ద కార్యక్రమానికి టస్ట్ ఛైర్మన్ పిసి రాయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుమారు వెయ్యి మంది పేదలకు చీరలు, పంచెలు, టవళ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, శరత్ కుమార్, డైరెక్టర్లు శ్రీదేవి, బండి మధుసూదన్ రెడ్డి, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: గాంధీ గ్రామ స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం సాధిస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని గుడి వీధిలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగ గ్రామ పంచాయతీలో స్వచ్ఛత హి సేవా ముగింపు కార్యక్రమం గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లక్ష్మీపురం ఎస్టీ కాలనీ శ్మశానానికి నూతనంగా బోరు వేసి చేతిపంపు బిగించి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా అధ్యక్షతన ఎంపిడివో సమక్షంలో గ్రీన్ అంబాసిడర్లు, శానిటేషన్ వర్కర్లు, పంపు ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

తడ: తడ ఎంపిడివో కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛత హిసేవ లో భాగంగా ఎంపిడివో విజయ్ కుమార్, ఎంపిపి కొలివి రఘు రెడ్డి, మండల ఉపాధ్యక్షులు, సిబ్బంది కలసి శ్రమదానం నిర్వహించారు. ఇటీవల విజయవాడలో భారీ వర్షాల సందర్భంగా అక్కడ పారిశుధ్య పనులు నిర్వహించిన తడ పారిశుధ్య సిబ్బందిని, సఫాయి కర్మచారులను ఘనంగా సన్మానించారు.

దొరవారిసత్రం: దొరవారి సత్రం మండల తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు శైలకుమారి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మోదుగుల ప్రవీణ్ రాయల్, విఆర్ఓ, మురళి, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, విజయ్, కృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: కెవిబిపురం మండల కేంద్రంలోని భారత గ్యాస్ ఆవరణలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజా కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ధనంజీవరెడ్డి, ఎంపీటీసీ మోహన్ నాయుడు, వైసిపి నాయకులు, మాజీ సర్పంచ్ శివప్రసాద్ వర్మ , ప్రవీణ్ కుమార్ , గోవిందస్వామి రెడ్డి , ఖాదర్ బాషా , ఆనంద్ రెడ్డి , గోపి, భారత్ గ్యాస్ సిబ్బంది, పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గాంధీ జయంతి వేడుకలు పుత్తూరు పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలు అందించి ఘన సన్మానం చేశారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద స్వచ్ఛత సేవలో భాగంగా పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, ఏలుమలై అమ్ములు, మాధవ నాయుడు, ఆనంద్, ఈశ్వర్ యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి రూరల్‌లో

శ్రీకాళహస్తి రూరల్: స్వాతంత్రం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహాత్మా గాంధీ లాంటి నాయకుల అడుగుజాడల్లో అందరూ నడవాలని శ్రీకాళహస్తి మండల ఎంపిడివో పటాన్ రఫీ ఖాన్ కోరారు. స్థానిక ఎంపిడివో కార్యాలయ ఆవరణలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వచ్ఛ తాహిలో చివరి రోజు స్వచ్ఛత దివాస్ లో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చెత్త చెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది అజార్, వెంకటేష్, నారాయణ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటాశ్రీనివాసులురెడ్డి , సర్వేపల్లి ఇన్‌ఛార్జి పూల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వేమయ్య ,బీసీ సెల్ ప్రెసిడెంట్ బ్రహ్మయ్య, ఓబీసీ సెల్ నియోజక వర్గ ఇంచార్జి సుబ్బరామరాజు , ,నెహేమియా,మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎల్లయ్య పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహాత్మ గాంధీ జయంతిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గుండ్లూరు నాగరాణి, అధ్యాపకులు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి నిఘంటువులు బహూకరించారు.

ప్రజాశక్తి - సత్యవేడు: సిపిఎం నాయకులు మెలుగు రమేష్, సత్యవేడు మండలం కాంగ్రెస్ అధ్యక్షులు రఘునాథ్ స్థానిక టవర్ క్లాక్ వద్ద గాంధీ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ కాకుండా పరిరక్షించాలని గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అంబేద్కర్, కాంగ్రెస్ నాయకులు మాణిక్యం శేఖర్, సిపిఎం కార్యకర్తలు కృష్ణయ్య, సుశీల పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
I.P.No.23 / 2024
Konduru Suresh ...**Petitioner**
V/s
R1) Eswar Raju Balachandra Raju
R2) Rudhraraju Ramalakshmamma
R3) Mokkapati Jayamma
R4) Rudhraraju Chiranjeevi Raju
R5) Ulasa Radhika
R6) Konduru Bhavani
R7) Hasthi Narasimhulu Raju
R8) Gunji Ravichandra
R9) Dommaraju Venkateswarlu Raju
R10) Cheruku Saraswathamma
R11) Cheruku Vijay Krishna
R12) Dalavai Anusha
R13) Ulasa Krishna Raju
R14) Guntamadugu Anuradhamma
R15) Dommaraju Chandrasekhar Raju
R16) Dommaraju Narayanamma
R17) Konduru Padmaja
R18) Ulasa Raghava Raju
R19) Dommaraju Venkata Subbamma
... **Respondents**
ఆక్షేపణ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు గల ఐ.పి.లో పిటిషనరు తనని Insolventగా డిక్లర్ చేయమని పై కోర్టులో ఐ.పి. పెట్టి వున్నందున ఎవరికైనా ఆక్షేపణలు వున్నయెడల తేది 25.10.2024న ఉదయం 10:30ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది.
ఇట్లు
కె. దసయ్య మొదలియార్,
ఎ. కోటేశ్వర రావు
పిటిషనరు తరపున వకీలు, గూడూరు

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
I.P.No.25/2024
Aruru Venkateswarlu ...**Petitioner**
V/s
R1) Aruru Paramdhamaiah
R2) Aruru Hymavathi
R3) Aruru Prakasam
R4) Aruru Venkata Ramanaiah
R5) Aruru Mahesh
R6) Arigonda Chandra Sekhar
R7) Gundala Kanchana
R8) Addanki Subbiah
R9) Sambareddi Suresh Naidu
R10) C. Sudhakar Naidu
R11) Sambareddi Chandraiah Naidu
R12) K. Srinivasulu
R13) Vadlamudi Jayarama Naidu
R14) Venkamma
R15) Bandila Ravi
R16) Chennuru Prabhakar Rerddy
R17) Bussa Lakshmi Narayana Reddy
R18) Nalluru Narayana
R19) Ashok Kumar
R20) The Proprietor R.K. Traders
R21) Vantinti Padmamma
R22) Murugan (Nagalakshmi Traders)
R23) Dasari Yedukondalu
R24) Alla Srinivasulu
R25) Ankaiah
R26) K. Vemulaiah
R27) Akkarapalli Madhava Reddy
... **Respondents**
ఆక్షేపణ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు గల ఐ.పి.లో పిటిషనరు తనని Insolventగా డిక్లర్ చేయమని పై కోర్టులో ఐ.పి. పెట్టి వున్నందున ఎవరికైనా ఆక్షేపణలు వున్నయెడల తేది 29.10.2024న ఉదయం 10:30ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది.
ఇట్లు
అంబటి కోటేశ్వర రావు
పిటిషనరు తరపున వకీలు, గూడూరు
సెల్: 9441381375